


## ఎస్సీలపై సుప్రీంకోర్టు తీర్పు పునఃపరిశీలించాలి


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఎడిటర్: బిర్రు కరుణాకర్ Cell:9701249103



సంపుటి - 2 సంచిక -339 గురువారం 16 ఏప్రిల్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# 'డీలిమిటేషన్'ను వ్యతిరేకిస్తాం

### మహిళా రిజర్వేషన్‌కు ఓకే

### ఇండియా వేదిక నిర్ణయం

న్యూఢిల్లీ , **ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకువస్తున్న డీ లిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) బిల్లును వ్యతిరేకించాలని ఇండియా వేదిక పార్టీలు నిర్ణయించాయి. రాజ్యసభలో



# బీహార్ ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరి ప్రమాణం

**పాట్నా , ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** బీహార్ నూతన ముఖ్యమంత్రిగా బిజెపి నాయకులు సామ్రాట్ చౌదరి బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. పాట్నాలోని లోక్‌భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సామ్రాట్ చౌదరి చేత గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ ప్రమాణస్వీకారం చేయించారు. అలాగే, జెడి(యు) సీనియర్ నాయకులు బిజేంద్ర ప్రసాద్ యాదవ్, విజయ్ కుమార్ చౌదరీ కూడా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. బహుశా ఈ ఇద్దరు నాయకులు ఉపముఖ్యమంత్రులుగా వ్యహరిస్తారని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ముఖ్య మంత్రి నితీష్‌కుమార్‌తో పాటు బిజెపి జాతీయ అధ్యక్షులు నితీన్ నబిన్, కేంద్ర మంత్రులు జెపి నడ్డా, బిజెపి, జెడి(యు) నాయకులు పాల్గొన్నారు.




# నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

### మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ

### ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం

### వాడీవేడీగా సాగనున్న సమావేశాలు




**న్యూఢిల్లీ, , ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** పార్లమెంట్ మరో చారిత్రక నిర్ణయానికి వేదిక కాబోతున్నది. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ఉభయ సభలు గురువారం నుంచి మూడ్రోజులు సమావేశం కాబోతున్నాయి. మహిళా బిల్లును ఇప్పటికే ఆమోదంచారు. 2026 జనాభా లెక్కల మేరకు సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కల మేరకే దీనిని మోదించే అవకాశం కనిపిస్తోంది. **మిగతా 2లో...**

# 'కుల కార్పొరేషన్ల' భర్తీకి గ్రీన్‌సిగల్

### ఒకట్రెండు రోజుల్లో జీవో

### మీనాక్షి నటరాజన్‌తో భేటీలో సీఎం నిర్ణయం

### పీఏసీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలంటూ పీసీసీ చీఫ్‌నకు విజ్ఞప్తి

**హైదరాబాద్ (, ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** అధికార పార్టీలోని ఆశావహులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కార్పొరేషన్ చైర్మెన్లు, పాలక మండళ్లకు సంబంధించిన పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఒకట్రెండు రోజుల్లో విడుదల కానున్నాయి. కాకపోతే ప్రస్తుతానికి నాయిబ్రాహ్మణ, పద్మశాలి, రజక తదితర కులాలకు చెందిన కార్పొరేషన్లలోని పోస్టులనే భర్తీ చేయనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో సీఎం బుధవారం **మిగతా 2లో...**





# బాలికలదే పైచేయి

### ఇంటర్ ఫలితాలు విడుదల

### కృష్ణా ఫస్ట్, అన్నమయ్య లాస్ట్

### మే 21 నుంచి సప్లిమెంటరీ

### ఫీజు గడువు ఏప్రిల్ 27 వరకు

**అమరావతి:, ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** ఇంటర్మీడియేట్ ఫలితాల్లో బాలికలు మరోసారి తమ సత్తా చాటారు. ఈ సారి కూడా బాలికలే హవానే కొనసాగింది. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాల్లో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించారు. 2026 ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ట్విట్టర్ వేదికగా బుధవారం విడుదల చేశారు. మొదటి సంవత్సరంలో 77శాతం, రెండవ సంవత్సరంలో 81శాతం ఉత్తీర్ణత నమోదయింది. 4,71,864 మంది తొలి ఏడాది పరీక్షలకు హాజరవ్వగా వీరిలో 3,61,526 మంది**మిగతా 2లో...**

# హార్ముజ్‌ను తెరుస్తున్నాం

### చైనా కోసండప్రపంచం కోసమే : ట్రంప్

### ఇరాన్ యుద్ధం ముగియబోతోంది

### రెండో విడత చర్చలకు దౌత్య యత్నాలు

### వాషింగ్టన్‌లో ఇజ్రాయిల్, లెబనాన్ రాయబారుల భేటీ




# మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

### యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి ఆగ్రహం

### రెండేళ్లలో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయం




# దక్షిణాదికి అన్యాయం చేస్తే పెను ఉద్యమం

### మహిళా రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు

### నియోజకవర్గాల పునర్విభజనతో ముడి పెట్టడానికి వ్యతిరేకం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




# టిడిపి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా లోకేశ్

### పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా కొనసాగింపు

### ఇద్దరు క్షేత్రస్థాయి నేతలకు పోలిట్ బ్యూరోలో స్థానం

### పార్టీ కార్యవర్గాన్ని పునర్నిర్మించిన చంద్రబాబు

**అమరావతి , ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** టిడిపి కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మంత్రి నారా లోకేశ్‌ను ప్రకటించింది. పార్టీకి ఇప్పటి వరకు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న లోకేశ్‌ఓ రకంగా ప్రమోషన్ పొందారు. మెల్లగా ఆయన చంద్రబాబుకు ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్నారు. ఇప్టపికే పార్టీలో అంతా తానై నడిపిస్తున్నారు. ఇకపోతే తెదేపా ఏపీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్ కొనసాగనున్నారు. పొలిటిబ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ఈ మేరకు పార్టీ ప్రకటించింది. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శులుగా రామ్మోహన్ నాయుడు, బైరెడ్డి శబరి, రాజేశ్ కిలార్‌లను పార్టీ నియమించింది. సీనియర్లకు గౌరవమిస్తూ.. కొత్తవారికి అవకాశాలు కల్పిస్తూ.. సామాజిక కోణంలో నూతన కమిటీల కూర్పు జరిగింది. విధేయత, కష్టపడే తత్వం, అనుభవం లెక్కించి అధిష్ఠానం పదవులు ఇచ్చింది. నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు రాని వారికి పార్టీ పదవుల ద్వారా న్యాయం కల్పించింది. అన్ని సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పుపై పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కసరత్తు చేశారు.**మిగతా 2లో...**



# పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణ

### ఆందోళనకు దిగిన జాగృతి అధ్యక్షురాలు కవిత



# బాలికలదే పైచేయి

**మొదటిపేజీ తరువాయి**

మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 4,46,537 మంది విద్యార్థులు హాజరు కాగా 3,59,816 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో బాలికలు 81శాతం, బాలురు 72శాతం ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో బాలికలు 85శాతం, బాలురు 76శాతం ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో బాలుర కంటే బాలికలు 4శాతం అదనంగా ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 90శాతంతో ద్వితీయ సంవత్సరంలో 92శాతంతోనూ కృష్ణా జిల్లా మొదటి స్థానంలో నిలవగా, అన్నమయ్య జిల్లా ప్రథమ సంవత్సరంలో 62శాతం, ద్వితీయ సంవత్సరంలో 67శాతం సాధించి చివరి స్థానంలో నిలిచింది. గ్రూపుల వారీగా ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఎంపిసిలో 77 శాతం, బైపిసి విద్యార్థులు 72, సిఇసి 50, హెచ్ఇసి 45, ఎంఇసి 88శాతం చొప్పున ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపిసి, బైపిసి 83శాతం, సిఇసి 63శాతం, హెచ్ఇసి 62శాతం, ఎంఇసి 81శాతం చొప్పున ఉత్తీర్ణులయ్యారు.

ఒకేషనల్ లో..!

ఒకేషనల్ కోర్సుల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 61శాతం ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరంలో 74శాతం సాధించారు. ప్రథమ సంవత్సరంలో బాలికలు 71శాతం, బాలురు 49శాతం ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో బాలికలు 83శాతం, బాలురు 62శాతం సాధించారు.

సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల హవా

ఇంటర్ ఫలితాల్లో సంక్షేమ హాస్టళ్లు విద్యార్థులు హవా సాధించారు. అందరి కంటే బిసి సంక్షేమ హాస్టళ్లల్లో చదువుతున్న ప్రథమ సంవత్సరంలో 97శాతం, ద్వితీయ సంవత్సరంలో 94శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎపిఆర్‌జెసి విద్యార్థులు తొలి సంవత్స రంలో 92శాతం, ద్వితీయ సంవత్సరంలో 95శాతం సాధించారు. గిరిజన సంక్షేమ హాస్టళ్లల్లో చదువుతున్న ప్రథమ సంవత్సరం విద్యార్థులు 90శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 93శాతం సాధించారు. కెజిబివి తొలి సంవత్సరం విద్యార్థులు 84శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 87శాతం ఉత్తీర్ణుల య్యారు. సంక్షేమ హాస్టళ్లల్లో చదువుతున్న తొలి సంవత్సరం విద్యార్థులు 87శాతం, ద్వితీయ సంవ త్సరం విద్యార్థులు 94శాతం ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూల్‌లో తొలి సంవత్సరం విద్యార్థులు 75శాతం సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 80శాతం ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 54, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 68శాతం, ఎయిడెడ్‌లో తొలి సంవత్సరం విద్యార్థులు 46శాతం, ద్వితీయ సంవత్సరం 64శాతం సాధించారు. హైస్కూల్ ప్లస్‌లో తొలి సంవత్సరం 45శాతం ఉత్తీర్ణత కాగా, ద్వితీయ సంవత్సరం 57శాతంగా నమోదైంది. ప్రైవేట్ జూనియర్ కళాశాలలు తొలి సంవత్సరంలో 80% మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో 82% మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

# నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

**మొదటిపేజీ తరువాయి**

ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభలు వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లు స్వరూపాన్ని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. అందువల్ల నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత కొరసాగుతోంది. ఉభయ సభల్లోనూ బిల్లుల ఆవశ్యకతపై ప్రధాని మోదీ మాట్లాడుతారు. ఇప్పటికే కాంగ్రెస్ తన వ్యూహం ఖరారు చేసుకుంది. తృణమూల్ సహా అనేక పార్టీలు అధికార బిజెపి తీరును తప్పుపడుతున్నాయి. ఇకపోతే దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం ఇప్పటివరకూ నాలుగు డీలిమిటేషన్ కమిషన్లు పని చేశాయి. ఇప్పుడు ఐదోది ఏర్పాటవుతోంది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో లోక్‌సభ స్థానాలు 54.54శాతం మేర పెరిగే అవకాశముంది. ఇప్పటి వరకూ ఆర్టికల్ 81(1) కింద రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే గరిష్ఠ లోక్‌సభ సభ్యుల సంఖ్య 530, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి గరిష్ఠ సంఖ్య 20గా ఉన్నాయి. అయితే ప్రస్తుతం 543 లోక్‌సభ స్థానాలకే ఎన్నికలు జరుగుతున్నాయి. మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026ను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. ఇందులో 2026 జనాభా లెక్కలకు ముందే నియోజకవర్గాలను పునర్విభజించడానికి వీలు కల్పిస్తూ ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332, 334ఏలకు సవరణలు ప్రతిపాదించింది. రాజ్యాంగంలో గరిష్ఠంగా 550 లోక్‌సభ స్థానాలను పేర్కొన్నా ప్రస్తుతం 543 మాత్రమే ఉన్నాయి. అంటే.. గరిష్ఠ సంఖ్యలో 98.72 నియోజకవర్గాలే ఉన్నట్లు లెక్క. ఆ నిష్పత్తి ప్రకారం చూస్తే కేంద్ర ప్రభుత్వం కొత్త స్థానాల సంఖ్యను 840దాకా ఖరారుచేసే సూచనలున్నాయి. అయితే ఇదివరకు వివిధ పార్టీల నాయకులతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చర్చలు జరిపినప్పుడు.. మొత్తం స్థానాలను గంపగుత్తగా 50శాతం పెంచుతామని చెప్పారు. ఆ ప్రకారం చూస్తే ఇప్పుడున్న 543 స్థానాలు 816కి చేరే అవకాశం ఉంటుంది. ఆర్టికల్ 81(3)లో 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కల ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించాలని ఉంది. ఇప్పుడు దాన్ని సవరించి.. గతంలోని జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడానికి తాజా బిల్లును కేంద్రం ప్రతిపాదించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 అసెంబ్లీ స్థానాల పునర్విభజన, ఆర్టికల్ 170 అసెంబ్లీ స్థానాల గరిష్ఠ సంఖ్య గురించి చెబుతున్నాయి. ఇప్పటివరకూ ఉన్న నిబంధనల ప్రకారం ఆర్టికల్ 82 కింద అసెంబ్లీ స్థానాలను పునర్విభజించాలంటే 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పుడు ఆ నిబంధనను సవరించి ప్రతి జనాభా లెక్కల తర్వాత అసెంబ్లీ స్థానాలను పునర్విభజించడానికి అవకాశం కల్పించారు. ఆర్టికల్ 334ఏలో ఇదివరకు 106వ రాజ్యాంగ సవరణ చట్టం-2023 (మహిళా రిజర్వేషన్ల చట్టం) ఆమోదం పొందిన తర్వాత చేపట్టే తొలి జనాభా లెక్కల ప్రాతిపదికన నిర్వహించే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఇప్పుడు దాన్ని సవరించి డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఇవి అమల్లోకి వస్తాయని స్పష్టత ఇచ్చారు. 84వ రాజ్యాంగ సవరణ చట్టం-2001లో ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332లను సవరించి 1971 జనాభా లెక్కల ప్రకారమే పార్లమెంటు, అసెంబ్లీల సీట్లను కేటాయించాలని పేర్కొన్నారు. 2026 తర్వాత తొలి జనాభా లెక్కలు చేపట్టేంతవరకూ వాటిని పునర్విభజించకూడదని షరతు విధించారు. 2003లో చేసిన 87వ రాజ్యాంగ సవరణ చట్టంలో ఆర్టికల్ 81, 82, 170, 330లను సవరించి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను పెంచకుండా 2001 జనాభా లెక్కల ప్రకారం ఆయా రాష్ట్రాల్లోని స్థానాలను పునర్విభజించు కోవడానికి అవకాశం కల్పించారు. దీని ప్రకారం 2008లో నియోజకవర్గాల పునర్విభజన చేయగా 2009 ఎన్నికల్లో అవి అమల్లోకి వచ్చాయి. మహిళా రిజర్వేషన్లకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పునర్విభజన కోసం సుప్రీంకోర్టు ప్రస్తుత/ మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కానుంది. బిల్లు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొంది చట్టరూపం దాల్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి కమిషన్ అమల్లోకి వస్తుంది. సుప్రీం కోర్టు ప్రస్తుత/మాజీ న్యాయమూర్తిని కేంద్ర ప్రభుత్వం కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గానీ, ఆయన నామినీగానీ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉంటారు. అలాగే రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమితులవుతారు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న పార్లమెంటు, అసెంబ్లీలతోపాటు, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలోని అసెంబ్లీ స్థానాల పునర్విభజననూ చేపడుతుంది.

తాజా జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా ఎన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు ఉండాలన్నది ఈ కమిషన్ నిర్ణయిస్తుంది. అలాగే రాష్ట్రాలవారీగా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను విభజిస్తుంది.

# దక్షిణాదికి అన్యాయం చేస్తే పెను ఉద్యమం

**మహిళా రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు**

**నియోజకవర్గాల పునర్విభజనతో ముడి పెట్టడానికి వ్యతిరేకం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్ , ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పేరుతో దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా అన్యాయం చేస్తే పెను ఉద్యమం తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం ఆయన ఎక్స్ ద్వారా ట్వీట్ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గితే అది కేవలం రాజకీయ ప్రక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదనీ, మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. మూడేండ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. తామంతా గర్వించదగ్గ భారతీయులమనీ, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రాష్ట్రాల ప్రతినిధులమని పేర్కొన్నారు. జనాభా నియంత్రణతోపాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు, ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, వాటి ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు. దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని, ప్రాతినిధ్యాన్ని అణచివేయాలని చూస్తే తాము నిశ్శబ్దంగా చూస్తూ ఉండబోమని స్పష్టం చేశారు. దక్షిణ భారతీయుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని కోరారు. "ఢిల్లీ పాలకులు తమ మాట వినాలనీ, బుద్ధి ప్రబలాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ మొదటి నుంచి చిత్తశుద్ధితో సంపూర్ణ మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడమే కాకుండా, అసెంబ్లీ, శాసన మండలిలో ఏకగ్రీవ తీర్మానాలు కూడా చేసిందని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు, మార్కెట్ కమిటీల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా మహిళా సాధికారత పట్ల తమకున్న అచంచలమైన నిబద్ధతను చాటుకున్నామని వివరించారు. మహిళా రిజర్వేషన్లను నియోజక వర్గాల పునర్విభజన రాజ్యాంగ సవరణ లతో ముడిపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అత్యంత సరళమైన విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ఎందుకు సంక్లిష్టం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలనీ, పార్లమెంటులో 543 సీట్లు ఉన్నాయనీ, వాటికి వర్తింపజేయాలని సూచించారు. తెలంగాణ లో 119 అసెంబ్లీ స్థానాలున్నాయనీ, ఇక్కడ కూడా అమలు చేయాలని కోరారు. సీట్ల పెంపు పునర్విభజనతో ముడిపెట్టి ఎందుకు అయోమయా న్ని సృష్టిస్తున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిం చారు. రాజ్యాంగ విధివిధానాల ప్రకారం మొదట జనగణన, తర్వాత నియోజకవర్గాల పునర్విభజన, ఆ తర్వాతే నిర్మాణాత్మక మార్పులు జరగాలని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనా లకు విఘాతం కలగని ఏ సహేతుకమైన ప్రతి పాదనకైనా బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు.

# హార్ముజ్‌ను తెరుస్తున్నాం



వాషింగ్టన్ : ప్రపంచ దేశాల కోసం హార్ముజ్ జలసంధిని శాశ్వతంగా తెరుస్తున్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. 'హార్ముజ్ జల సంధిని నేను శాశ్వతంగా తెరిచినందుకు చైనా చాలా సంతోషిస్తోంది. నేను చైనా కోసంఢప్రపంచం కోసం ఆ పని చేశాను. ఈ పరిస్థితి ఇకపై ఎన్నడూ ఉత్ప న్నం కాదు. ఇరాన్‌కు ఆయుధాలు పంపరాదని వారు అంగీకరించారు. కొన్ని వారాల క్రితం నేను అక్కడికి వెళ్లినప్పుడు అధ్యక్షుడు జిన్‌పింగ్ నన్ను పెద్దగా, బలంగా హత్తుకున్నారు. మేము కలిసి పనిచేసుకుం టున్నాం' అని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. కాగా ఇరాన్‌కు ఆయుధాలు అందించవద్దని జిన్‌పింగ్‌కు లేఖ రాశా నని ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇరాన్‌కు చైనా ఆయుధాలు అందిస్తోం దని తాను విన్నానని, అలా చేయవద్దని కోరుతూ లేఖ రాశానని చెప్పారు. తాను అలా చేయడం లేదని జిన్‌పింగ్ ప్రత్యుత్తరం ఇచ్చారని అన్నారు.

**ఇరాన్ యుద్ధం ముగియబోతోంది**

ఇరాన్‌పై మొదలు పెట్టిన యుద్ధం త్వరలోనే ముగియబోతోందని అమెరికా అధ్యక్షుడు చెప్పారు. యుద్ధాన్ని సైనిక చర్యతో ముగించబోవడం లేదని ఆయన తెలిపారు. ఇరాన్‌తో రెండో విడత చర్చలకు అమెరికా సిద్ధమవుతున్న వేళ ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. 'మాపని ఇంకా పూర్తి కాలేదు. మేము నిష్క్రమిస్తే ఇరాన్ పునర్నిర్మాణానికి 20 సంవత్సరాలు పడుతుంది. ఏం జరుగుతుందో చూద్దాం. ఒప్పందం చేసుకోవాలని వారు బలంగా కోరుకుంటున్నారని నేను అనుకుంటున్నాను' అని ట్రంప్ చెప్పారు. ఫాక్స్ బిజినెస్ ప్రతినిధితో ట్రంప్ బుధవారం మాట్లాడుతూ ఇరాన్‌పై ప్రత్యక్ష దాడి చేయాలన్న తన నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. ఇరాన్ అణు సామర్థ్యాన్ని నిర్మూలించడానికి ఆ చర్య అవసరమని అన్నారు. 'నేను ఆ పనిచేయకపోతే ఇరాన్ వద్ద ఇప్పటికే అణ్వాయుధం ఉండేది. ఒకవేళ వారి వద్ద అణ్వాయుధం ఉంటే మీరు వారిని సర్ అని వినయంగా పిలవాల్సి వచ్చేది. అలా జరగాలని ఎవరూ కోరుకోరు' అని ట్రంప్ చెప్పారు. అలాగే పదివేల మందితో యూఎస్ బలగాలు పశ్చిమాసియాలో మకాం వేసి ఉన్నట్టు తెలిపారు.

**హార్ముజ్‌లో నౌకల రవాణాను అనుమతించండి : అమెరికాను కోరిన సౌదీ**

హార్ముజ్ జలసంధి మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని ఇరాన్‌తో చర్చలు జరపాలని అమెరికా ప్రభుత్వాన్ని సౌదీ అరేబియా కోరింది. లేకుంటే ప్రాంతీయ, ఆర్థిక సంక్షోభం తీవ్రతరమవుతుందని హెచ్చరించింది. హార్ముజ్ మూసివేతకు ప్రతీకారంగా గల్ఫ్‌కు ఆవల ఇరాన్ దాడులు చేయవచ్చునని, ఇతర కీలక సముద్ర మార్గాలను అడ్డుకోవచ్చునని అరబ్ అధికారులు వాషింగ్టన్ పోస్ట్ పత్రికకు తెలియజేశారు. సౌదీ అరేబియాలోని కీలక బాబ్ అల్-మందెబ్ జలసంధిని ఇరాన్ లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉన్నదని సౌదీ అందోళన చెందుతోంది. ఎర్ర సముద్రంలోని ఈ జలసంధి ద్వారానే సౌదీ నుంచి చమురు ఎగుమతులు ఎక్కువగా జరుగుతుంటాయి. బాబ్ ఎల్-మందెబ్‌ను మూసివేయాలని ఇరాన్ అనుకుంటే హౌతీలు జత కలుస్తారని యెమన్ నిపుణుడు ఆడం బరన్ చెప్పారు. గాజా ఘర్షణ సమయంలో హౌతీలు తమ సామర్థ్యాన్ని ప్రదర్శించారని ఆయన గుర్తు చేశారు.

# 'డీలిమిటేషన్'ను వ్యతిరేకిస్తాం

**మొదటిపేజీ తరువాయి**

ప్రతిపక్షనేత,ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో బుధవారం సాయంత్రం ఇండియా వేదిక పార్టీ నేతల సమావేశం జరిగింది. వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికలతో పాటు, డీ లిమిటేషన్, మహిళారిజర్వేషన్ల బిల్లు అంశాలను చర్చించాయి. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను తీసుకువస్తున్నట్లు సమావేశంలో నేతలు అభిప్రాయపడ్డారు. అనంతరం మల్లికార్జున ఖర్గే మీడియాతో మాట్లాడుతూ డీ లిమిటేషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఇండియా వేదిక పార్టీలు పార్లమెంటులో ఐక్యంగా పోరాడుతాయని చెప్పారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్ విభజన నిర్ణయం తీసుకుందని అన్నారు. తొలుత జనగణన పూర్తి చేయాలని, కొత్త జనాభా లెక్కల ఆధారంగానే డీ లిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అదేసమయంలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా వేదిక అనుకూలంగా ఉందని, దానిని వ్యతిరేకించడం లేదని అన్నారు. అయితే, మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రం తీసుకువస్తున్న తీరు సరికాదని చెప్పారు. రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు చేస్తోందని విమర్శించారు. రాజ్యాంగంలోని అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వర్గం తీసుకుంటోందన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తోందన్నారు. 'డీలిమిటేషన్‌కు సంబంధించి జనాభా గణన అంశంపై స్పష్టత లేదు. రాజ్యాంగంలోని అన్ని హక్కుల్ని తీసేసుకుంటున్నారు.

# టిడిపి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా లోకేశ్

**మొదటిపేజీ తరువాయి**

29 మందితో పొలిట్ బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీ కూర్పు చేశారు.జాతీయ ప్రధాన కార్యదర్శులు-3, జాతీయ ఉపాధ్యక్షులు-18, జాతీయ అధికార ప్రతినిధులు-10రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు-7, రాష్ట్ర ఉపాధ్యక్షులు-16, రాష్ట్ర అధికార ప్రతినిధులు-14, రాష్ట్ర జోనల్ కో-ఆర్డినేటర్లు-10, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు-59, రాష్ట్ర కార్యదర్శులు-77 తో పునర్నిర్మించారు.ఓ మండల పార్టీ అధ్యక్షురాలికి, ఓ క్లస్టర్ ఇన్చార్జికి నేరుగా పొలిట్ బ్యూరోలో చోటు కల్పిస్తూ సంచలన నిర్ణయం తీసుకకున్నారు. పార్టీ అత్యున్నత స్థాయి కమిటీ పొలిట్ బ్యూరోలో చోటు దక్కించుకున్న గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గుత్తికొండ ధనుంజయ్ అత్యున్నత స్థాయికి ఎదిగారు. రాష్ట్ర కమిటీలోని 185 మందికి గానూ... 50 మంది మహిళలకు చోటు, పొలిట్ బ్యూరో, జాతీయ కమిటీల్లోనూ మహిళలకు సముచిత స్థానం కల్పించారు. జనాభా దామాషా పద్ధతిన, సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పు చేశారు. 185 మంది రాష్ట్ర కమిటీ సభ్యుల్లో 122 మంది బడుగులకు స్థానం కల్పించింది. బీసీ-77, ఎస్సీ-25, ఎస్టీ-7, మైనార్టీ-13 మందికి రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని కోణాల్లో విశ్లేషించి చంద్రబాబు కమిటీల కూర్పు చేపట్టినట్లు అర్థంఅ వుతోంది.

# 'కుల కార్పొరేషన్ల' భర్తీకి గ్రీన్‌సిగల్

**మొదటిపేజీ తరువాయి**

కీలక సమావేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో దాదాపు నాలుగు గంటలపాటు వారు పలు అంశాలపై చర్చించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, కార్యదర్శులు, ఇతర ఆర్గనైజర్ల పోస్టుల భర్తీపై కూడా వారు సమాలోచనలు చేసినట్టు తెలిసింది. మండల, బూత్ లెవల్ కమిటీల ఏర్పాటుపై సైతం వారు చర్చించారు. కేంద్రం చేపడుతున్న నియోజకవర్గాల పునర్ విభజన, రాష్ట్రానికి జరగబోయే నష్టం గురించి ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. కాంగ్రెస్ సంస్థాగత విషయాలపై చర్చించి, నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా త్వరలోనే పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ)ని నిర్వహించాలంటూ ఆయన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు.

కాగా కార్పొరేషన్లతోపాటు పార్టీ పదవులను భర్తీ చేసేటప్పుడు క్రియాశీలకంగా ఉన్న జిల్లాలు, అక్కడి సామాజిక సమీకరణాలు, పార్టీ కోసం పనిచేసిన నేతలు తదితరాంశాలపై జాబితాను రూపొందించాలంటూ సీఎం సూచించారు. ఒక్కో ఆశవహుడి పేరును ప్రస్తావిస్తూ ఆయన చర్చించారు. 'ఒక్కరికి కేవలం ఒక పదవేడ' అనే సూత్రాన్ని పక్కాగా, తూ.చా. తప్పకుండా పాటించాలంటూ కోరారు. ఇదే విధంగా భవిష్యత్ అవసరలను దృష్టిలో ఉంచుకుని సామాజిక సమీకరణాలు, పొందికలపై దృష్టి సారించాలని సమావేశంలో నిర్ణయించారు. ఇప్పటికే కార్పొరేషన్ చైర్మెన్లు, ప్రభుత్వ సలహాదారుల పోస్టుల కోసం వందలాది మంది దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. ఆ జాబితాను సాధ్యమైనంతగా వడబోసి, పార్టీకి విధేయులుగా ఉండి, ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకోసం పని చేసి, క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న వారిని గుర్తించాలని సీఎం భావిస్తున్నారు. వారిలోంచి మొదటి దఫాగా 20 నుంచి 25 మందికి పదవులను కట్టబెట్టాలని ఆయన నిర్ణయించారు. ఇదే సమయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక తరగతులకు ప్రాధాన్యతనిస్తూనే రెడ్డి సామాజిక తరగతిని కూడా 'సంతృప్తి' పరిచే విధంగా జాబితాలను సిద్ధం చేయాలని సీఎండ పీసీసీ చీఫ్‌కు విజ్ఞప్తి చేశారు. కాగా కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో కనీసం 30 శాతం మహిళలకు కేటాయించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

## మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష

**హైదరాబాద్, , ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి, పారదర్శకతపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి పనుల పురోగతి, రైతులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన అధికారులతో చర్చించారు. గత రెండు సంవత్సరాల్లో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయంతో 630 అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు మంత్రికి అధికారులు వెల్లడించారు. ఇందులో రూ.128 కోట్లతో 113 పనులు పూర్తయ్యాయని నివేదిక సమర్పించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ప్రతి పనికి టైమ్‌లైన్ నిర్ణయించి వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారం చేయకుండా లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి లైసెన్సులను రద్దు చేయాలని ఆదేశించారు. అలాంటి వారికి సహకరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పంట ఉత్పత్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు తుమ్మల. గడ్డిఅన్నారం మార్కెట్‌లో 'స్మార్ట్ మార్కెట్ యార్డ్' అమలు చేయాలని, డిజిటలైజేషన్ ద్వారా జీరో బిజినెస్ సమస్యను తగ్గించాలని నిర్ణయించారు. కోహెడ మార్కెట్ అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ ఖర్చు తగ్గింపుపైనా మంత్రి దృష్టి సారించారు. మార్కెట్ యార్డుల్లో సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేసి, జులై చివరి నాటికి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని అన్నారు. వ్యవసాయ కొనుగోళ్ల విషయానికి వస్తే.. ఖరీఫ్ సీజన్‌లో పత్తి కొనుగోళ్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లకు మిర్చి అధికంగా వస్తోందని పేర్కొన్నారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. టార్పాలిన్లు, తేమ కొలమానాలు, డ్రైయర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోళ్లలోనూ రైతులకు పూర్తి రక్షణ కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అలాగే రైతుల ఖాతాలకు నేరుగా చెల్లింపులు చేస్తామని స్పష్టం చేశారు. మొత్తం మీద మార్కెట్ యార్డ్‌లను ఆధునీకరించి, రైతులకు అనుకూలంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల వెల్లడించారు.

# పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణ

## ఆందోళనకు దిగిన జాగృతి అధ్యక్షురాలు కవిత

**వికారాబాద్, , ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** :వికారాబాద్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అరెస్టు చేశారు. పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రైతుల భూములను బలవంతంగా సేకరిస్తున్నారని ఆరోపిస్తూ ఉదయం నుంచి కవిత ఆందోళన చేశారు. ఈ క్రమంలోనే రైతులతో కలిసి వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం పారిశ్రామికీకరణ ముసుగులో రైతుల పొట్ట కొడుతోందని ఆమె ఆరోపించారు. భూసేకరణ ఆపకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామన్నారు. తక్షణమే భూసేకరణ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ క్రమంలో రైతులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ జాగృతి, ధర్మ సమాజ్ పార్టీలు రైతులకు సంఘీభావం తెలిపాయి.

-------

# పోరాటం నుంచి ప్రేరణగా దళిత రత్న వక్కల వెంకటస్వామి




**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కృషి చేస్తున్న దళిత రత్న డాక్టర్ వక్కల వెంకటస్వామి, పోరాటం సేవ నాయకత్వానికి నిదర్శనంగా నిలుస్తున్నారు. ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన ఆయన, నిరుపేద మాదిగ కుటుంబంలో జన్మించి కష్టనష్టాలను అధిగమిస్తూ సమాజ సేవలో ప్రత్యేక గుర్తింపు పొందారు.

విద్యార్థి దశలోనే సుభాష్ చంద్రబోస్ యువజన సంఘాన్ని స్థాపించి యువతలో చైతన్యం నింపిన వెంకటస్వామి, ఉన్నత విద్యను అభ్యసిస్తూ పాత్రికేయ రంగాన్ని సేవామార్గంగా ఎంచుకున్నారు. ప్రస్తుతం 'వివేక సమయం' దినపత్రిక, 'డీజే4 వార్తా ప్రసార మాధ్యమం'లో సంపాదకుడిగా కొనసాగుతూ ప్రజా సమస్యలపై ధైర్యంగా స్వరం వినిపిస్తున్నారు.

గ్రామీణ స్థాయిలో మహిళా సంఘాల ఏర్పాటు, డ్వాక్రా మహిళలకు మార్గదర్శకత్వం, మండల స్థాయి బాధ్యతలు నిర్వర్తిస్తూ మహిళా సాధికారతకు కృషి చేశారు. "నా వివేకం" స్వచ్ఛంద సంస్థ ద్వారా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, అనాథలు, పేద విద్యార్థులకు సహాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుతున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ఆయన, ఎంఆర్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలందించారు. మిలియన్ మార్చ్, సాగరహారం, సడక్ బంద్ వంటి ఉద్యమాల్లో ముందుండి ప్రజలను చైతన్యపరిచారు.

కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ మున్సిపల్ కార్మికులకు అండగా నిలిచారు. న్యాయ సంబంధిత సమస్యల్లో సహాయం చేస్తూ డ్రైవర్ల సంఘాలకు మద్దతు అందిస్తున్నారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతి వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు "దళిత రత్న" పురస్కారం లభించింది. అంబేద్కర్ ఫెలోషిప్‌తో పాటు ఈ గౌరవం ఆయన సేవలకు గుర్తింపుగా నిలిచింది. పోరాటమే జీవితండ సేవే లక్ష్యండ సమాజానికి అంకితమైన నాయకుడిగా వెంకటస్వామి ముందుకు సాగుతున్నారు.

## తెదేపా జాతీయ నాయకులకు శుభాకాంక్షలు తెలిపిన నారపోగు ప్రసాద్





**తల్లాడ,/ ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా ఎంపికైన టిడిటి బోర్డు సభ్యులు నన్నూరి నర్సిరెడ్డి, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఎన్నికైన బక్కని నరసింహులు కు సత్తుపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు నారపోగు ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ, పార్టీ కోసం నిరంతరం శ్రమించిన నాయకులకు ఈ పదవులు రావడం ఆనందదాయకమన్నారు. నర్సిరెడ్డి, నరసింహులు ఇద్దరి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ రెండు రాష్ట్రాల్లో మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తిరిగి వస్తుందని, పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఎనారపోగు ప్రసాద్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## గోపాల్‌పూర్ గ్రామంలో అభివృద్ధి ప్రణాళిక ప్రారంభం



**ఎల్కతుర్తి/, ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. ఈ సమావేశానికి సర్పంచ్ కర్రె లక్ష్మీ భిక్షపతి, కార్యదర్శి మిల్కూరి గణపతి ఆధ్వర్యం వహించారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణను గ్రామంలో అమలు చేస్తున్నట్లు వారు తెలిపారు. ముఖ్యంగా క్లీన్ & గ్రీన్ కార్యక్రమం, మురికి కాలువల శుభ్రత, రహదారుల విస్తరణ వంటి పనులను ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ప్రతి బుధవారం వారసంతను ఏర్పాటు చేసి గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తూ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని సర్పంచ్ కర్రె లక్ష్మీ భిక్షపతి, కార్యదర్శి మిల్కూరి గణపతి మీడియాకు వివరించారు.

# రోడ్డు ప్రమాదంలో సీపీఐ మండల కార్యదర్శి ఓర్సు రమేష్ మృతి

### వివిధ పార్టీల నాయకుల సంతాపం..



**తల్లాడ/, ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** సీపీఐ తల్లాడ మండల కార్యదర్శి ఓర్సు రమేష్ (48) బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. తల్లాడలోని తన నివాసం నుంచి మామిడితోట పనుల నిమిత్తం నరసింహారావుపేటకు ద్విచక్ర వాహనంపై బయలుదేరిన రమేష్, గ్రామ ప్రధాన రహదారి పక్కన ఆగి ఉండగా వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన కొద్ది దూరం ఎగిరిపడి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

సమాచారం అందుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు జాగర్లమూడి రంజిత్ కుమార్, తాటి వెంకటేశ్వరావు, దండు అదినారాయణ, తోట రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ, ఎబు, యామల గోపాలరావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, రాంబాబు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అదేవిధంగా తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, షేక్ ఈసు, చల్ల నాగులు, సరికొండ శ్రీనివాసరాజు, గుంటుపల్లి వెంకటయ్య, రాయల నరసింహారావు, తమ్మిశెట్టి నరసింహారావు, గోపాల్ రెడ్డి, అనుమోలు సర్వేశ్వరరావు, ఎండి బహుదూర్ తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. రమేష్ అంతిమయాత్రను తల్లాడ పట్టణంలో భారీ ర్యాలీగా నిర్వహించి కన్నీటి వీడ్కోలు పలికారు. జిల్లాలోని వివిధ పార్టీల నాయకులతో పాటు తెలుగుదేశం పార్టీ నేత నారపోగు ప్రసాద్ బాబు హాజరై నివాళులు అర్పించారు. ప్రైవేట్ ఎలక్ట్రానిక్స్ యూనియన్ సభ్యుడిగా పనిచేసిన రమేష్‌కు యూనియన్ ఆధ్వర్యంలో కూడా భారీ ర్యాలీ నిర్వహించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల రోదనలు అక్కడున్న వారిని కదిలించాయి.

# విద్య జీవన విలువలు నేర్పాలి

### పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



**సత్తుపల్లి,/ ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా జీవన విలువలు నేర్పే ప్రక్రియ అని ఆర్‌టీసీ డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రమశిక్షణ, గౌరవం, ధైర్యం, సహనం వంటి లక్షణాలు జీవితంలో విజయానికి పునాది అని తెలిపారు. విద్యార్థులు పాఠశాలలో అడుగుపెట్టిన మొదటి రోజుల నుంచి ఇప్పటి వరకు సాధించిన పురోగతిని గుర్తుచేసుకుంటూ, వారు ఆత్మవిశ్వాసంతో కూడిన యువతగా ఎదిగారని అభినందించారు. పాఠశాల ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులను గౌరవించడం, గురువులను స్మరించడం, వినయంతో జీవించడం ప్రతి విద్యార్థి బాధ్యత అని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులకు రెండో ఇల్లు అని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల అంకితభావాన్ని ప్రశంసిస్తూ, తల్లిదండ్రుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం నరుకుళ్ల సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్సీలపై సుప్రీంకోర్టు తీర్పు పునఃపరిశీలించాలి




**తల్లాడ/, ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** ఎస్సీలు క్రిస్టియన్లుగా మారితే ఎస్సీ హోదా రద్దవుతుందని సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పును పునఃపరిశీలించాలని తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం. సుదర్శనం ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వెళ్తూ మార్గమధ్యంలో తల్లాడలో ఆగిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ మతాలు, కులాలు వేర్వేరు అంశాలని పేర్కొన్నారు. మత మార్పిడి జరిగిన దళితులు ఇప్పటికీ దళితవాడల్లోనే నివసిస్తూ అదే సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో దళితులు ఏ మతాన్ని స్వీకరించినా వారిని దళితులుగానే పరిగణించి, వారికి అందాల్సిన రాయితీలు యథావిధిగా అమలు చేయాలని ప్రభుత్వాలను కోరారు.

అదనంగా జిల్లాలు, మండల కేంద్రాల్లో కమ్యూనిటీ హాల్లు నిర్మించాలని, క్రిస్టియన్ సమాజానికి స్మశాన వాటికల కోసం భూములు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీసీసీ జిల్లా బాధ్యులు నిరీక్షణ రావు, జి. బాబురావు, కే. ఇశ్రాయేలు, జి. యాకోబు, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద బాధితుడికి సహాయోగ్ ఆసరా

**సంగెం/ఏప్రిల్ 15(జర్నలిస్ట్ వార్త);**




ప్రమాదవశాత్తు కాలు కోల్పోయి వికలాంగుడిగా మారిన ఆటో డ్రైవర్ కుటుంబానికి 'సహాయోగ్ ఫౌండేషన్' అండగా నిలిచింది. మండలంలోని ముమ్మిడివరం గ్రామానికి చెందిన అవనగంటి సారంగం ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవల ఆటో, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో అతని ఎడమకాలు తీవ్రంగా గాయపడటంతో వైద్యులు దానిని తొలగించారు. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని ఫౌండేషన్ సభ్యుడు తాళ్లపల్లి నాగరాజు సంస్థ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఫౌండేషన్ సభ్యులు బాధితుడికి రూ. 5,000 ఆర్థిక సహాయాన్ని నాగరాజు ద్వారా అందజేశారు. తమ కష్టకాలంలో ఆదుకున్న ఫౌండేషన్ సభ్యులకు, నాగరాజుకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు

# ఆరోగ్యం, విద్యుత్ రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత

**కల్లూరు/, ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే ఆరోగ్యం, విద్యుత్ రంగాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

బుధవారం కల్లూరు మండలంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా కల్లూరులో రూ.10.50 కోట్ల వ్యయంతో నిర్మించిన 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. అలాగే నారాయణపురంలో రూ.2.75 కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు సమీపంలోనే మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఈ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కీలక పాత్ర




పోషిస్తుందన్నారు. అదేవిధంగా కొత్తగా నిర్మించనున్న విద్యుత్ ఉపకేంద్రం ద్వారా పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తోందని ఆయన వివరించారు.

ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, ఎన్‌పీడీసీఎల్ సీఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి, డీసీహెచ్ఎస్ డా. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న చిన్నారికి అభినందనలు






**నర్సంపేట,/ ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట పట్టణం శాంతినగర్‌కు చెందిన చింతకింది శివకృష్ణ మౌనిక దంపతుల కుటుంబం అరుదైన ఘనత సాధించింది. వీరి ముగ్గురు సంతానం ఒకే నెల, ఒకే తేదీన రెండు సంవత్సరాల వ్యవధిలో జన్మించడం విశేషంగా నిలిచింది. ఈ ప్రత్యేకతతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ 2026లో చోటు సంపాదించారు.మొదటి సంతానం కూతురు అక్షర 2020 జూన్ 3న, రెండవ సంతానం అర్జున్ 2022 జూన్ 3న, మూడవ సంతానం ఆదిత్య 2024 జూన్ 3న జన్మించారు. ఈ అరుదైన సంఘటన స్థానికంగా అందరి దృష్టిని ఆకర్షించింది.ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారి అక్షరతో పాటు ఆమె తల్లిదండ్రులను శాలువాతో సత్కరించి మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్, మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్ అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బీరం భరత్ రెడ్డి, పొన్నాల మనిషా ప్రకాష్, శ్రీరామోజు రోజా రాణి, ఇస్లావత్ రమా గోపి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొల్లూరి మధుకర్, 4వ వార్డు అధ్యక్షుడు మంచినీళ్ల నాగరాజు, కాంగ్రెస్ యూత్ సభ్యులు కొర్ర రాహుల్, ఉపూల శాలూమ్, దేవోజు హేమంత్, భూక్యా గణేష్, చీకటి శివమణి తదితరులు పాల్గొన్నారు.ఈ అరుదైన రికార్డు సాధించిన కుటుంబానికి స్థానిక ప్రజలు, నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రకృతి సంపదను ప్రపంచానికి పరిచయం చేస్తాం

### పులిగుండాలకు డబుల్ రోడ్డుకు గ్రీన్ సిగ్నల్

### సీతారామ జలాల మళ్లింపుపై అధ్యయనం



**పెనుబల్లి,/ ఏప్రిల్ 15: (జర్నలిస్ట్ వార్త)** తెలంగాణలోని అపురూపమైన ప్రకృతి సంపదను ప్రపంచానికి పరిచయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.పెనుబల్లి మండలం బ్రాహ్మళ్లకుంట పరిధిలోని పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్టును బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం జంగిల్ సఫారీ, బోటింగ్ కార్యక్రమాలను ప్రారంభించి ప్రకృతి సోయగాలను ఆస్వాదించారు.సభలో మాట్లాడుతూ పులిగుండాలను రాష్ట్రంలో అగ్రశ్రేణి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. పర్యాటకుల సౌకర్యార్థం ఈ ప్రాంతానికి వెళ్లే రహదారిని డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వెల్లడించారు. కనకగిరి హిల్స్ అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.స్థానిక ఎమ్మెల్యే విన్నపం మేరకు సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నుంచి పులిగుండాలకు నీటిని మళ్లించే అంశంపై సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామని తెలిపారు. దీని ద్వారా వేసవిలోనూ ప్రాంతం జలకళతో కళకళలాడుతుందని, పర్యాటక రంగం అభివృద్ధితో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రగతి ప్రణాళికలో జగన్నాథ్‌పూర్ గ్రామం బేస్



**ఎల్కతుర్తి, /ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామంలో ప్రగతి ప్రణాళిక అమలు వేగంగా కొనసాగుతోంది. గ్రామ సర్పంచ్ పంజాల యాదగిరి, కార్యదర్శి గాజుల దీప ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి పనులు విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామంలో మురికి కాలువల శుభ్రత, వీధి దీపాల మరమ్మతులు, ప్రభుత్వ పాఠశాలలు మరియు అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి, రోడ్ల పరిశుభ్రత వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు.అదేవిధంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా "అరైవ్-అలైవ్" కార్యక్రమం కింద అవసరమైన పనులను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో నీటి ట్యాంకుల శుభ్రపరచడం, బ్లీచింగ్ పిచికారీ చేయడం వంటి పారిశుద్ధ్య చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని సర్పంచ్ పంజాల యాదగిరి తెలిపారు.

# నిధులు సమకూర్చండి - అభివృద్ధి చేసి చూపిస్తా

### : మంత్రి పొన్నం వద్ద జీలుగుల సర్పంచ్ విజ్ఞప్తి





**ఎల్కతుర్తి,/ ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని జీలుగుల గ్రామ అభివృద్ధికి నిధులు సమకూర్చాలని సర్పంచ్ గనబోయిన సృజన రాజు యాదవ్ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కోరారు. ఇటీవల మంత్రి వద్దకు వెళ్లిన సర్పంచ్, గ్రామంలోని పలు సమస్యలను వివరించి పరిష్కారం కోసం వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ సుఖినే సంతాజీ, పెంచికల్‌పేట్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీనివాస్, మాజీ యూత్ అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్ (బక్కి), హింగే శ్రీకాంత్ తదితరులు సర్పంచ్‌తో కలిసి మంత్రి దృష్టికి సమస్యలను తీసుకువెళ్లారు. గ్రామంలో రహదారులు, తాగునీరు, చెరువుల పూడికతీత వంటి కీలక అంశాలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.సమస్యలను శ్రద్ధగా విన్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ స్పందిస్తూ, గ్రామ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి కార్యకర్త అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు.గ్రామ అభివృద్ధిలో సర్పంచ్ గనబోయిన సృజన ముందంజలో ఉన్నారని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.ఇదిలా ఉండగా, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా మార్చి 6, 2026 నుంచి జూన్ 12, 2026 వరకు 99 రోజుల పాటు గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించబడుతోంది. ఇందులో రోడ్డు భద్రత, చెరువుల పూడికతీత పనులు వేగవంతం చేస్తున్నట్లు సర్పంచ్ గనబోయిన సృజన రాజు, కార్యదర్శి రావుల సందీప్ తెలిపారు.

## స్నేహితుని కుటుంబానికి అండగా నిలిచిన మిత్రులు



**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ వార్త):** మానవతా విలువలు ఇంకా చిగురిస్తున్నాయనే విషయాన్ని ధర్మసాగర్‌లో స్నేహితులు మరోసారి నిరూపించారు. మండల కేంద్రానికి చెందిన గంటే సాంబరాజ్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా, ఆయన కుటుంబాన్ని ఆదుకోవడానికి చిన్ననాటి మిత్రులు, సహచరులు ముందుకు వచ్చారు.

ధర్మసాగర్ ప్రభుత్వ పాఠశాల 20022003 బ్యాచ్‌కు చెందిన స్నేహితులు కలిసి రూ.67,000 సేకరించగా, దేవాదుల పంప్ హౌస్‌లో సాంబరాజ్‌తో కలిసి పనిచేసిన మిత్రులు రూ.34,000 అందజేశారు. అదేవిధంగా చిన్ననాటి మిత్రుడు మేకల కుమార్ (ఎస్.ఐ) రూ.10,000, యాదవ సంఘం పెద్దలు రూ.18,000 చొప్పున సహాయం చేశారు. మొత్తం రూ.1,29,000ను సాంబరాజ్ కుమార్తె పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా పెట్టి, డిపాజిట్ బాండ్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ, సాంబరాజ్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. స్నేహబంధానికి నిలువెత్తు నిదర్శనంగా ఈ సహాయం నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శాతవేణి రాజ్‌కుమార్, పుట్ట రాజనీకాంత్, ఎం.డి. హఫీజ్, కె. గురుమూర్తి, పి. ప్రశాంత్, పి. రవీందర్, పోసు నాగరాజు, బొడ్డు భరత్, పి. చిరంజీవి, పోలుమారి ప్రఫుల్, సీహెచ్. అనిల్, కళ్లేపు రాజు, శేషాల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిస్సహాయకులకు,మహిళలకు చేయూతగా నిలుస్తోన్న చేతన ఫౌండేషన్

### -పోలీసు అధికారుల ప్రశంసలు..

### -లబ్ధిదారుల కళ్ళలో ఆనందం..







**బయ్యారం/,ఏప్రిల్ 15.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలం కొత్తపేట పంచాయతీ గంధంపల్లి రైతు వేదికలో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పేద ప్రజల ఉపాధికి దోహదపడే విధంగా వివిధ ఉపకరణాల పంపిణీ బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పోలీసు అధికారులు చేతన ఫౌండేషన్ సేవలను కొనియాడారు.

ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడ్డప్పటికీ స్వగ్రామాన్ని మరవకుండా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చేతన ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెనిగళ్ళ రవి కుమార్ సేవా భావం ప్రశంసనీయం అని మహబూబాబాద్ డిఎస్పీ నంబూరి తిరుపతిరావు పేర్కొన్నారు.విదేశాల్లో ఉంటూ కూడా స్వదేశ ప్రజల అభ్యున్నతికి కృషి చేయడం గొప్ప విషయం అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు 13 తోపుడు బండ్లు,మూడు పిండి మిల్లులు, మూడు ఇస్త్రీ పెట్టెలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఎల్మాగ్నెటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తమ సిఎస్ఆర్ సంస్థ నిధులు అందించగా చేతన ఫౌండేషన్ సభ్యులు గ్రామంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టారు.చేతన ఫౌండేషన్ ద్వారా లబ్దిపొందిన లబ్ధిదారులు చేతన ఫౌండేషన్ వారికీ కృతజ్ఞతలు తెలిపారు.చేతన ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెనిగళ్ళ రవి కుమార్ మార్గదర్శకత్వంలో బంధుమిత్ర బృందం రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం వారి నిస్వార్థ సేవకు నిదర్శనం అని డిఎస్పి తిరుపతి రావు అన్నారు.ఇటువంటి మంచి కార్యక్రమాలకు పోలీసు శాఖ నుండి ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా ప్రవీణ్ కుమార్,సిఐ రవీందర్,ఎస్ఐ తిరుపతి,చేతన ఫౌండేషన్ కెనడా ప్రతినిధి సీతారామారావు,సంస్థ అధ్యక్షుడు వెనిగళ్ళ అనిల్ కుమార్,ఉపాధ్యక్షుడు వెనిగళ్ళ వెంకటేశ్వరరావు,జాయింట్ సెక్రటరీ దొడ్డా సీతారామయ్య, సభ్యులు తాతా గణేష్,నవీన్,రషీద్, తోటకూర అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే.





**బయ్యారం/,ఏప్రిల్ 15.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతీలో దేశిని కొమురయ్య దిశ దినకర్మలకు ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య హాజరైన కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి కుమారులు దేశిని రాంబాబు,దేశిని నగేష్,దేశిని శీనులను పరామర్శించి మనోధైర్యాన్ని నింపారు.వారితో పాటు జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి,కొత్తపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్, సపవత్ రాందాస్ నాయక్, సర్పంచ్ లింగా నాయక్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు గ్రామ పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరా పర్యవేక్షణలో బయ్యారం పెద్ద చెరువు.



**బయ్యారం/,ఏప్రిల్ 15.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం పెద్ద చెరువు వద్ద రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అనధికారంగా తూములను లేపి నీటిని వృధా చేయడం గత మూడు రోజులుగా జరుగుతున్నట్లు సమాచారం. ఇలా తూములను లేపడం వల్ల పంట పొలాలకు అందాల్సిన నీరు వృధా అవ్వడం జరుగుతుంది.ఇలాంటి చర్యల వల్ల యాసంగీ పంటకు అనుమతించబడిన రైతులకు పంటలకు తగిన నీరు అందకుండా ఇబ్బందులు కలగవచ్చని గమనించిన నీటిపారుదల శాఖ అధికారులు ఈ సమస్యను నివారించుటకు చెరువు భద్రతను మెరుగుపరుచుటకు చెరువు తూము సమీపంలో సీసీ కెమరాలను ఏర్పాటు చేసినట్లు నీటి పారుదల శాఖ డిఈఈ నాగార్జున సాగర్ బుధవారం తెలిపారు.

## జిల్లా కలెక్టర్ ను కలిసిన ఇల్లందు ఎమ్మెల్యే.



**బయ్యారం/,ఏప్రిల్ 15.(జర్నలిస్ట్ వార్త)** మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ని వారి కార్యాలయంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్ తో మాట్లాడుతూ గార్ల బయ్యారం మండలాలకు సంబంధించిన అనేక అభివృద్ధి పనులకు,పెండింగ్ వర్క్ లకు సంబందించిన అంశాలపై మాట్లాడినట్లు తెలిపారు.రబిలో పండించిన మొక్కజొన్న రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని, సంబంధిత అధికారులు ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్ ని ఎమ్మెల్యే కనకయ్య కోరారు.ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి,కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ తదితరులు ఉన్నారు.

# 'పెద్ది' జూన్‌కు వాయిదా..
## కారణమేంటో చెప్పిన మేకర్స్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదల మరోసారి వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఏప్రిల్ 30న విడుదల కావాల్సిన ఈ సినిమాను జూన్ నెలలో రిలీజ్ చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ బుధవారం అధికారికంగా ప్రకటించింది.

సినిమాకు సంబంధించిన టాకీ పార్ట్ మొత్తం పూర్తయిందని, కేవలం ఒక పాట చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉందని చిత్రబృందం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే సినిమా ఎడిట్ ప్రింట్ చూసుకున్నామని, అవుట్‌పుట్ పట్ల చాలా సంతోషంగా ఉన్నామని పేర్కొంది. "ప్రేక్షకులకు అత్యుత్తమ థియేటర్ అనుభవాన్ని అందించాలనేదే మా లక్ష్యం. అద్భుతమైన కంటెంట్‌ను అంతే గొప్పగా ముస్తాబు చేసేందుకు, పోస్ట్ ప్రొడక్షన్, టెక్నికల్ టీమ్స్‌కు మరికొంత సమయం ఇవ్వాలనుకుంటున్నాం. వారి నైపుణ్యంతో సినిమాను పరిపూర్ణంగా తీర్చిదిద్దేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని నిర్మాతలు వివరించారు.

సినిమా పాటలు, గ్లింప్స్‌కు వస్తున్న అద్భుతమైన స్పందనకు ధన్యవాదాలు తెలిపిన చిత్రబృందం, అభిమానుల సహకారానికి కృతజ్ఞతలు చెప్పింది. రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రానికి ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. జూన్‌లో కచ్చితమైన విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని మేకర్స్ స్పష్టం చేశారు.

# ఫ్రాన్స్ యానిమేషన్ ఫెస్టివల్‌లో యానిమేషన్ బాహుబలి
## భారతీయ చిత్ర పరిశ్రమకు దక్కిన గుర్తింపు అన్న రాజమౌళి

రాజమౌళి సృష్టించిన 'బాహుబలి' మరో ఘనతను సొంతం చేసుకుంది. ఆయన రూపొందించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న సరికొత్త యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ద ఎటర్నల్ వార్' . 2027లో ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ చిత్రం ఒక అరుదైన మైలురాయిని చేరుకుంది. ఫ్రాన్స్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక ఎన్నేసి యానిమేషన్ ఫెస్టివల్ 2026 లోని 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' విభాగంలో ప్రదర్శనకు అధికారికంగా ఎంపికైంది. దీనిపై రాజమౌళి ఆనందం వ్యక్తంచేశారు. యానిమేషన్ అనేది హద్దులు లేని అద్భుతమైన ప్రపంచమనే విషయాన్ని నేను ఎప్పుడూ నమ్ముతానని ఈ సందర్భంగా అన్నారు. ఇది మన భారతీయ సినిమాకి



దక్కిన ఒక అరుదైన గౌరవంగా భావిస్తున్నా. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన యానిమేషన్ వేదికపై ఈ సినిమాను ప్రదర్శించే అవకాశం రావడం మాకెంతో ఆనందంగా ఉంది. దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం అని రాజమౌళి పోస్ట్ పెట్టారు. యానిమేషన్ రంగంలో ఈ ఫెస్టివల్‌ను 'యానిమేషన్ ప్రపంచపు కేన్స్ ఫెస్టివల్'గా పరిగణిస్తారు. భారతీయ యానిమేషన్ సత్తాను ప్రపంచ వేదికపై చాటిచెప్పేందుకు ఇదొక గొప్ప అవకాశంగా సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అమరేంద్ర బాహుబలి మరణం తర్వాత జరిగే పరిణామాల నేపథ్యంలో దీన్ని రూపొందిస్తున్నారు. దాదాపు రూ.120 కోట్ల భారీ బడ్జెట్‌తో 'ఆర్కా మీడియా వర్క్స్' ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

# మైమరపిస్తున్న భాగ్యశ్రీ..





సినిమా ఇండస్ట్రీలో ఒక్కోసారి అదృష్టం చిత్ర విచిత్రంగా ఉంటుంది. కొందరికి వరుస హిట్లు వచ్చినా గుర్తింపు ఉండదు, కానీ మరికొందరికి ఒక్క సక్సెస్ లేకపోయినా విపరీతమైన క్రేజ్ వస్తుంది. సరిగ్గా ఇదే బాటలో సాగుతోంది యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే. టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన అతి తక్కువ కాలంలోనే తన అందం, అభినయంతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ మరాఠీ భామ, ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ అవుతోంది. అసలు ఈమె ఫేట్ మార్చబోయే ఆ కొత్త ప్లాన్ ఏంటి? ఆ విశేషాలు చూద్దాం.. మిస్టర్ బచ్చన్‌తో ఎంట్రీ.. హిట్టు లేకున్నా క్రేజ్: భాగ్యశ్రీ బోర్సే 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోయినా, భాగ్యశ్రీకి మాత్రం మంచి మార్కులే పడ్డాయి. ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను కట్టిపడేశాయి. ఆ తర్వాత 'కింగ్డమ్', 'కాంత', 'ఆంధ్ర కింగ్' వంటి చిత్రాల్లో నటించినా, ఇప్పటివరకు ఈ బ్యూటీ ఖాతాలో ఒక్క గట్టి బ్లాక్‌బస్టర్ కూడా పడలేదు. అయినప్పటికీ, స్టార్ హీరోల సరసన నటించే అవకాశాలు మాత్రం ఈమెను వెతుక్కుంటూ వస్తుండటం విశేషం. పక్కింటి అమ్మాయి నుంచి గ్లామర్ డాల్‌గా: ఇప్పటివరకు భాగ్యశ్రీ బోర్సే ఎక్కువగా పక్కింటి అమ్మాయి తరహా పాత్రల్లోనే కనిపించింది. అయితే, కేవలం అవే పాత్రలు చేయడం వల్ల తన కెరీర్ ఆశించిన స్థాయిలో ఊపందుకోవడం లేదని ఈ బ్యూటీ గ్రహించినట్లు సమాచారం. ఇక అందుకే ఇప్పుడు తన రూట్ మార్చాలని నిర్ణయించుకుంది. ఇకపై కేవలం నటనకే పరిమితం కాకుండా, గ్లామర్ విషయంలో కూడా డోస్ పెంచాలని ఫిక్స్ అయిందట. తనలోని మరో కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేసేందుకు ఈ మరాఠీ సుందరి సిద్ధమవుతోంది.

# 'టాక్సిక్' వాయిదాపై క్లారిటీ..
## పుకార్లకు చెక్ పెట్టిన చిత్రం యూనిట్

రాకింగ్ స్టార్ యశ్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' విడుదల మళ్ళీ వాయిదా పడిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని చిత్రం బృందం తీవ్రంగా ఖండించింది. ముందుగా ప్రకటించినట్టుగానే జూన్ 4, 2026న సినిమా కచ్చితంగా ప్రేక్షకుల ముందుకు వస్తుందని స్పష్టం చేసింది. ఈ మేరకు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, అభిమానులు ఆందోళన చెందవద్దని కోరింది.



గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా పోస్ట్-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చిత్రం యూనిట్ తెలిపింది. ఈ వదంతులకు చెక్ పెడుతూ, హీరో యశ్ ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. లాస్ వెగాస్‌లో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక 'సినిమాకాన్' ఈవెంట్‌లో ఆయన పాల్గొని, 'టాక్సిక్' అంతర్జాతీయ ప్రమోషన్లను ప్రారంభించారు. ఈ పర్యటనలో యశ్ 'టాక్సిక్'తో పాటు తాను నటిస్తున్న మరో భారీ చిత్రం 'రామాయణ' ప్రమోషన్ల బాధ్యతలను కూడా చూసుకుంటున్నారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'రామాయణ'లో యశ్ రావణుడి పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఒకవైపు 'టాక్సిక్' విడుదల పనులు, మరోవైపు 'రామాయణ' ప్రమోషన్లతో యశ్ బిజీగా గడుపుతుండటంతో, వాయిదా వార్తలకు బలం లేదని స్పష్టమవుతోంది.

# టాలీవుడ్‌లో సమ్మె సైరన్
## : మే 1 నుంచి థియేటర్ల బంద్‌కు సిద్ధం



తెలుగు సినీ పరిశ్రమలో నిర్మాతలు, ఎగ్జిబిటర్ల (థియేటర్ యజమానులు) మధ్య నెలకొన్న వివాదం తీవ్రరూపం దాల్చుతోంది. ఆదాయంలో వాటా (రెవెన్యూ షేరింగ్) విషయంలో ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో మే 1వ తేదీ నుంచి తెలంగాణ వ్యాప్తంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లను నిరవధికంగా మూసివేయాలని ఎగ్జిబిటర్ల సంఘం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో సమ్మర్ సీజన్‌లో విడుదల కావాల్సిన పలు క్రేజీ సినిమాల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది.ప్రస్తుతం ఉన్న రెంటల్ పద్ధతి వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని థియేటర్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన నిర్వహణ ఖర్చులు, ఓటీటీల ప్రభావంతో ప్రేక్షకుల సంఖ్య తగ్గడంతో థియేటర్లు నడపడం కష్టంగా మారిందని వారు చెబుతున్నారు. అందుకే, మల్టీప్లెక్స్‌ల తరహాలో వసూళ్లలో మొదటి వారం 60 శాతం రెండో వారం 50 శాతం, మూడో వారం 40 శాతం వాటా ఇచ్చేలా కొత్త రెవెన్యూ షేరింగ్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.అయితే, ఈ ప్రతిపాదనను యాక్టివ్ తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ (టాఫ్పీ+) వ్యతిరేకిస్తోంది. ఇప్పటికే నిర్మాణ వ్యయాలు విపరీతంగా పెరిగాయని, ఈ సమయంలో రెవెన్యూ షేరింగ్ విధానం అమలు చేస్తే నిర్మాతలు మరింతగా నష్టపోతారని వారు వాదిస్తున్నారు. ఏప్రిల్ 30లోగా ఈ సమస్య పరిష్కారం కాకపోతే సమ్మె ఖాయమని ఎగ్జిబిటర్లు స్పష్టం చేశారు.

ఒకవేళ సమ్మె జరిగితే మే నెలలో విడుదల కావాల్సిన నిఖిల్ 'స్వయంభూ', సమంత 'మా ఇంటి బంగారం', 'కొరియన్ కనకరాజు', 'సూర్య కరుప్పు' వంటి చిత్రాలపై తీవ్ర ప్రభావం పడనుంది. ఈ వివాదానికి త్వరగా ముగింపు పలకాలని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి.

# అవకాశం వస్తే చిరంజీవి సినిమాలో విలన్‌గా చేస్తా
## 'ఎఫ్.సి.ఏ' మీట్ ది ప్రెస్ లో హీరో రాజశేఖర్

ఒకప్పుడు యాంగ్రీ హీరోగా వెండితెరను ఏలిన డా. రాజశేఖర్ తో హైదరాబాద్ ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ 'మీట్ ది ప్రెస్' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇటీవల విడుదలైన 'బైకర్' చిత్రంలో ఆయన ప్రదర్శించిన నటనకు గుర్తింపుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ప్రభు, అధ్యక్షుడు జె.వి. బత్తుల ప్రసాద్‌రావు, కార్యదర్శి సురేష్ కొండేటి, కోశాధికారి భరద్వాజ తదితరులు రాజశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందించి, సన్మాన పత్రంతో గౌరవించారు. ఈ కార్యక్రమానికి రాజశేఖర్‌తో పాటు ఆయన అర్ధాంగి జీవిత కూడా హాజరయ్యారు.సన్మానం స్వీకరించిన అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ.. 'బైకర్' చిత్రంలోని తన పాత్రకు మంచి స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. "విజయం చూసి చాలా రోజులైంది. ఈ విజయం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. ఇతర అవార్డులతో పోలిస్తే క్రిటిక్స్ అసోసియేషన్ ఇచ్చే గౌరవం నాకు చాలా పెద్దది" అని ఆయన భావోద్వేగంగా చెప్పారు. 'అంకుశం' సినిమాకు ముందు, ఇప్పుడు 'బైకర్'కు ముందు యాక్సిడెంట్ జరగడం, ఆ తర్వాత సినిమాలు



హిట్టవ్వడం యాదృచ్ఛికమని, తదుపరి చిత్రం కూడా విజయం సాధిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు.

జీవిత రాజశేఖర్ మాట్లాడుతూ.. మీడియా తమ కుటుంబానికి ఎప్పుడూ అండగా నిలిచిందని అన్నారు. అయితే, ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో వచ్చే వార్తల వల్ల జర్నలిజంపై కొంత గందరగోళం ఏర్పడుతోందని అభిప్రాయపడ్డారు. రాజశేఖర్‌కు ఎన్నో అవకాశాలు వస్తున్నప్పటికీ, తనకు నచ్చిన, స్ఫూర్తినిచ్చే పాత్రల కోసమే ఎదురుచూస్తున్నారని ఆమె స్పష్టం చేశారు.

సీనియర్ జర్నలిస్టులు ప్రభు, మోహన్ గోటేటి, బాలరెడ్డి, గిరిధర్, ట్రేడ్ గైడ్ వెంకటేశ్వరరావు, జనార్దన్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ రాజశేఖర్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 'అంకుశం', 'అల్లరి ప్రియుడు' వంటి చిత్రాలతో స్టార్‌డమ్ సాధించినా ఆయనలో ఏమాత్రం గర్వం ఉండదని, అందరితో ఎంతో ఆప్యాయంగా కలిసిపోతారని కొనియాడారు. ఆయనది కల్లాకపటం లేని మనసని, ఆయన కెరీర్‌లో జీవిత పాత్ర ఎంతో కీలకమని ప్రశంసించారు.ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు రాజశేఖర్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. మంచి కథ వస్తే స్టార్ హీరో చిరంజీవి చిత్రంలోనైనా విలన్‌గా నటించడానికి సిద్ధమని ప్రకటించారు. ప్రస్తుతం పవన్ సాధినేని దర్శకత్వంలో ఒక సినిమా, ఐ.వి. శశి కుమారుడి దర్శకత్వంలో మరో సినిమా చేస్తున్నట్లు తెలిపారు.

అటు తమిళ నటుడు విజయ్ రాజకీయ ప్రవేశాన్ని స్వాగతించారు. ప్రజాదరణలో ఎంజీఆర్ తర్వాత అంతటి స్పందన విజయ్‌కే దక్కుతోందని ప్రశంసించారు. రాజకీయాలు ఎంతో ఖర్చుతో, సమయంతో కూడుకున్న వ్యవహారం కాబట్టి, ప్రస్తుతం సినిమాలపైనే దృష్టి పెడుతున్నట్లు స్పష్టం చేశారు. మొత్తం మీద ఈ కార్యక్రమం 'బైకర్' చిత్రంతో రాజశేఖర్ అందుకున్న విజయాన్ని అభినందించడమే కాకుండా, సినీ పాత్రికేయులతో ఆయనకున్న దశాబ్దాల అనుబంధాన్ని గుర్తుచేసింది.